
ఈనాడు
పల్నాడు
బుధవారం అక్టోబరు 9, 2024



మహాలక్ష్మిగా నర్సింగపాడు అన్నపూర్ణాదేవి



ధన మహాలక్ష్మి

దసరా నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. పలుచోట్ల కరెన్సీ నోట్లతో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. నకరికల్లు మండలంలోని నర్సింగపాడులోని మరకత లింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో గంగా అన్నపూర్ణాదేవిని రూ.3 కోట్ల కరెన్సీ నోట్లతో చేసిన అలంకరణ ఆకట్టుకుంది. నోట్లతో మాచర్లలో వాసవీ కన్యకాపరమేశ్వరికి అలంకరణ

- నకరికల్లు, మాచర్ల(కారంపూడి), న్యూస్‌టుడే

మాచర్లలోని వాసవీ కన్యకా పరమేశ్వరి..

11 నుంచి మిర్చియార్డుకు సెలవులు

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు మిర్చియార్డుకు ఈనెల 11వ తేదీ నుంచి సెలవులు ఇస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. 11న దుర్గాష్టమి, 12న విజయదశమితో పాటు వారాంతం, 13వ తేదీ ఆదివారం సాధారణ సెలవు కారణంగా వరుసగా మూడు రోజులు పాటు మిర్చి క్రయవిక్రయాలు జరగవన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు శుక్ర, శని, ఆదివారాలు మిర్చియార్డుకు సరకు తీసుకురావద్దన్నారు. 14వ తేదీ నుంచి యథావిధిగా మిర్చి వ్యాపార లావాదేవీలు జరుగుతాయని వివరించారు.


49,047 మిర్చి బస్తాల విక్రయం: మిర్చియార్డుకు రైతులు మంగళవారం 47,486 బస్తాలు తరలించారు. గత నిల్వలతో కలిపి 49,047 బస్తాల విక్రయాలు జరిగాయి. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 22,368 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,000-16,500, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.7,500-18,700, తాలు మిర్చికి రూ.5,000-12,000, ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,500-17,500, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,000-18,500, తాలు మిర్చికి రూ.5,000-10,000 ధర లభించింది.

కన్నీటి గాథ!

- తనఖా పెట్టిన బంగారం మాయం
- బ్యాంకు మేనేజరు మోసానికి రోడ్డున పడ్డ కుటుంబాలు
- డిపాజిట్ చేసిన సొమ్ము ఏమైందోనని ఆందోళన

ఈనాడు-అమరావతి, న్యూస్‌టుడే-చిలకలూరిపేట గ్రామీణ

బ్యాంకులో సొమ్ము డిపాజిట్ చేసుకుంటే సీనియర్ సిటిజన్ల కింద అధిక వడ్డీ వస్తుందని కొందరు.. ఇల్లు, పొలాలు అమ్మిన సొమ్ము డిపాజిట్ చేసుకుంటే నెలనెలా వచ్చే వడ్డీతో జీవితం గడపవచ్చని కొందరు.



. ఆర్థిక అవసరాలకు బంగారం తనఖా పెట్టి రుణాలు తీసుకున్న మరికొందరు.. ఇలా చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో లావాదేవీలు నిర్వహించిన వారికి గతంలో అక్కడ మేనేజర్‌గా పనిచేసిన వ్యక్తి నిలువునా మోసగించాడు. మోసం జరిగినట్లు తెలుసుకున్న ఖాతాదారులు బ్యాంకుకు వచ్చి తనిఖీ అధికారులకు వారు డిపాజిట్ చేసిన సొమ్ము వివరాలు, తనఖా పెట్టిన బంగారు అభరణాల వివరాలను చెప్పి న్యాయం చేయాలని కోరుతున్నారు. నెల నెలా డిపాజిట్ చేసిన వారికి వడ్డీ జమ అవుతుండటంతో వారికి అనుమానం రాలేదు. మూడు నెలలుగా వడ్డీ జమకాకపోవడంతో ఆరా తీస్తే అసలు మోసం వెలుగులోకి వచ్చింది. ఇలా మోసపోయినవారిలో పల్లెటూరి వారితోపాటు పట్టణానికి చెందిన వివిధ వ్యాపారాలు, ఉద్యోగాలు చేసేవారు కూడా ఉండటం గమనార్హం. ఒక ఖాతాదారునికి రూ.10 లక్షలు డిపాజిట్ చేయగా బ్యాంకు నిబంధనల ప్రకారం నెలకు రూ.4900 వడ్డీ జమకావాల్సి ఉంది. అయితే అధికవడ్డీ పేరుతో నెలకు రూ.10వేల వరకు గరిష్ఠంగా జమచేశాడు. ఈ మొత్తం నెలవారీగా బ్యాంకు నుంచి కాకుండా రెండు ట్రేడింగ్ కంపెనీల నుంచి జమయింది. బ్యాంకుకు వెళ్లి విచారిస్తే డిపాజిట్ చేసిన సొమ్మును ఓడీ రూపంలో తీసుకున్నట్లు తేలింది. డిపాజిట్ చేసినట్లు బాండు ఉన్నా ఖాతాలో సొమ్ము మిగలలేదు. గోవిందాపురానికి చెందిన ఒక ఖాతాదారు రూ.95లక్షలు డిపాజిట్ చేసి నెలనెలా వడ్డీ తీసుకున్నారు. ఈ మొత్తం ఓడీ రూపంలో తీసుకోవడంతో ఖాతాలో నిల్వలు నిండుకున్నాయి. మరోవైపు ఇదే ఖాతాదారు కిలో బంగారం తాకట్టు పెట్టగా అది కూడా తనఖాలో లేదని తేలింది. ఇలా పలువురు డిపాజిట్ చేసినట్లు, బంగారం తాకట్టు పెట్టినట్లు పత్రాలు ఉన్నా బ్యాంకు వద్ద సొమ్ము, బంగారాన్ని పాత మేనేజర్ సొంతానికి వాడుకుని ఖాతాదారులకు తీరని వేదన మిగిల్చారు. బ్యాంకు ఉన్నతాధికారులు వారం రోజులుగా మోసపోయినవారిని పిలిచి వివరాలు సేకరిస్తున్నారు. వీరు నివేదిక ఇచ్చిన తర్వాత బ్యాంకు ఉన్నతాధికారులు తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంది.

మోసం చేశారిలా..

చిలకలూరిపేట ఐసీఐసీఐ బ్యాంకులో మేనేజరు ఒకరు ఖాతాదారులతో పరిచయాలు పెంచుకుని సొమ్ము డిపాజిట్ చేస్తే అధిక వడ్డీ వస్తుందని ఆశచూపారు. నెలనెలా వడ్డీ చెల్లిస్తామని, బ్యాంకులో ఇందుకు ప్రత్యేకంగా ఒక బృందం ఉంటుందని వారు వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టడం వల్ల అధికవడ్డీ చెల్లిస్తామని నమ్మబలికారు. తొలుత కొంత సొమ్ము డిపాజిట్ చేసి నెలనెలా వడ్డీ ఖాతాలకు జమకావడంతో బంగారం తాకట్టు పెట్టి కొందరు, ఇతర అవసరాలకు వేరే బ్యాంకుల్లో రుణాలు తీసుకుని మరీ డిపాజిట్లు చేశారు. ఖాతాదారు డిపాజిట్ చేసే సమయంలోనే ఓడీ దరఖాస్తు మీద కూడా మేనేజరు సంతకాలు తీసుకున్నారు. ఖాతాదారులు ఆయా దరఖాస్తులు చదివి సంతకాలు పెట్టకుండా బ్యాంకు సిబ్బంది సూచించిన చోట్ల సంతకాలు చేయడంతో వారు డిపాజిట్ చేసిన వెంటనే ఓడీ తీసుకున్నట్లు నమోదయింది. ఇలా డిపాజిట్ చేసిన సొమ్ములో సింహభాగం ఓడీ తీసుకున్నారు. ఇందుకు అనుగుణంగా కొందరి ఖాతాదారుల చరవాణి నంబర్లకు సందేశాలు సైతం వచ్చాయి. అయితే ప్రతినెల వడ్డీ జమమవుతుండటంతో ఎవరికీ అనుమానం రాలేదు.

పకడ్బందీగా సంతకాలు చేయించుకొని మరీ..

బంగారం తనఖా పెట్టి రుణాలు తీసుకున్న సమయంలోనూ తనఖా ఫారంతోపాటు బంగారం తిరిగి తీసుకున్నట్లు కూడా దరఖాస్తులపై సంతకాలు ముందస్తుగా తీసుకున్నారు. ఖాతాదారుడు బ్యాంకులో పెట్టిన రోజుల వ్యవధిలోనే సొమ్ము చెల్లించి బంగారాన్ని మేనేజరు బయటకు తీసుకున్నారు. ప్రైవేటు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు బంగారం తాకట్టు పెట్టుకుని అధికంగా రుణాలు ఇస్తుండటంతో ఆయా సంస్థల్లో బంగారాన్ని తాకట్టు పెట్టి మేనేజరు రుణం తీసుకున్నారు. ఇలా తాకట్టు పెట్టే క్రమంలో వేర్వేరు నకిలీ పేర్లతో తాకట్టు పెట్టారు. ఇందుకు ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలను ఎంపిక చేసుకున్నారు. మేనేజరు తెలివిగా వ్యవహరించి డిపాజిట్ చేసిన సొమ్ము నుంచి ఓడీ రూపంలో నగదు, తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకుని ప్రైవేటు సంస్థల్లో పెట్టి అధిక రుణం తీసుకుని సొమ్ము చేసుకున్నారు. చిలకలూరిపేట నుంచి బదిలీపై నరసరావుపేట, విజయవాడ వెళ్లినా పలుమార్లు ఇక్కడి వచ్చి వ్యవహారాలు చక్కబెట్టుకున్నారు. మూడు నెలలుగా డిపాజిట్ చేసినవారికి వడ్డీ జమకాకపోవడం, మరోవైపు ఓడీ తీసుకున్న సొమ్ము చెల్లించాలని సందేశాలు రావడంతో అనుమానం వచ్చి బ్యాంకుకు వస్తే మోసం వెలుగులోకి వచ్చింది. ఈనేపథ్యంలో తాకట్టు పెట్టిన బంగారం గురించి ఆరా తీయగా, అక్కడా మోసం జరిగినట్లు తేలింది. దీంతో చిలకలూరిపేటలోని ప్రైవేటు బ్యాంకు, ఫైనాన్స్ సంస్థల్లో వాకబు చేయగా బ్యాంకు మేనేజరు వివిధ పేర్లతో అక్కడ బంగారం తాకట్టు పెట్టినట్లు గుర్తించారు. ఇందులో కొందరి బంగారం ఉన్నట్లు గుర్తించి ఎంత రుణం తీసుకున్నారో తెలుసుకున్నారు. ఒక ఖాతాదారుడు ఐసీఐసీఐ బ్యాంకులో బంగారం తాకట్టు పెట్టి రూ.12లక్షలు తీసుకోగా అదే బంగారాన్ని ప్రైవేటు సంస్థ వద్ద తనఖా పెట్టి రూ.20 లక్షలు తీసుకున్నట్లు తేలింది. సదరు ఖాతాదారుడు బంగారాన్ని ఎక్కడెక్కడ తాకట్టు పెట్టారోనని ఆందోళన చెందుతున్నారు. బ్యాంకు వద్దకు వచ్చిన బాధిత ఖాతాదారులది ఒక్కొక్కరిది ఒక్కో కన్నీటి గాథ.

బ్యాంకు ఘటనలో బాధితులకు న్యాయం జరగాలి: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: ఐసీఐసీఐ బ్యాంకు ఘటనలో నష్టపోయిన ప్రతిఒక్కరికీ న్యాయం జరగాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో పనిచేసిన మేనేజర్, గోల్డ్ అప్రైజర్ కలిసి రూ.కోట్లు మోసం చేస్తుంటే బ్యాంకు యంత్రాంగం కళ్లు మూసుకుందా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదట చిలకలూరిపేట అనుకుంటే నరసరావుపేటలోనూ ఇదే తరహా మోసం వెలుగుచూడడం, అదే మేనేజర్ విజయవాడలోనూ పనిచేయడంతో అక్కడ ఇంకా ఏం చేసి ఉంటారనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. బ్యాంకులో మాయమైన బంగారం, ఫిక్స్‌డ్ డిపాజిట్లకు సంబంధించి ప్రతి పైసా ఖాతాదారులకు తిరిగివ్వాలని పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై తక్షణం క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు

వినుకొండ, న్యూస్‌టుడే: అనుమతులు లేని పురుగు మందులు, ఎరువులు, బయో ఉత్పత్తులను గుర్తించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం వినుకొండలోని దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సరైన ఆధారాలు లేని రూ.68.77లక్షల విలువైన నిల్వల విక్రయాలను తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఇన్‌ఛార్జి ఏడీఏ రవికుమార్ తెలిపారు. అనుమతులు లేకుండా బయోలను తయారు చేస్తూ చట్టాన్ని, రైతులను మోసం చేసే వారిపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. వెన్నపూస కాలనీలోని రెండు గోదాంలలో ద్రావకం ఉన్న మూడు డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బాధ్యులైన ఇద్దరిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. బయోలు ఎరువుల చట్టం కింద తీసుకొచ్చినందున జీ 1, 2, 3 పత్రాలు ఉన్న తయారీదారులు దానికనుగుణంగానే విక్రయించాలని సూచించారు. తనిఖీల్లో ఏడీఏతో పాటు మండల వ్యవసాయాధికారులు అంజిరెడ్డి, అంకారావు, రామారావు, సుగుణాబేగం, డీఆర్‌సీ ఏవో ప్రవీణ్‌లు పాల్గొన్నారు.



వెన్నపూస కాలనీలో గోదాం తనిఖీ చేస్తున్న ఏడీఏ రవికుమార్ తదితరులు

నకిలీ ఉత్పత్తులపై ఉక్కుపాదం మోపాలి: జీవీ

వినుకొండ, న్యూస్‌టుడే: నకిలీ ఎరువులు, పురుగు మందులపై ఉక్కుపాదం మోపాలని శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు కోరారు. ఈమేరకు ఆయన కలెక్టర్ అరుణ్‌బాబు, వ్యవసాయాధికారి మురళితో మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. వినుకొండతో పాటు పల్నాడు జిల్లాలో అనధికారికంగా బయోఉత్పత్తుల తయారీ, విక్రయాలు చేస్తున్నట్లు 'ఈనాడు'లో వచ్చిన కథనాలను ప్రస్తావించారు. రైతులు నష్టపోయే ఏ చర్యను ప్రభుత్వం అంగీకరించదన్నారు. ఇందులో ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గద్దని అవసరమైతే నిందితులపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. వినుకొండ ప్రాంతంలో డీఏపీ కొరత ఉన్నట్లు రైతులు తన దృష్టికి తెచ్చారని సరిపడా నిల్వలు సరఫరా చేయాలని కోరారు. సీజన్‌లో ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడకూడదని అందుకే తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వారికి సూచించారు.

దారి మళ్లించి దోపిడీ

- ఇసుక అమ్మేస్తున్న దళారులు
- సామాన్యులకు అందక అవస్థలు

ఈనాడు-నరసరావుపేట, బాపట్ల



రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తీసుకొచ్చి ఇసుక తవ్వకం, రవాణా ఛార్జీలు మాత్రమే వసూలు చేస్తోంది. ఇసుక డంపింగ్‌యార్డుల్లో టన్ను ఇసుక రూ.250కు విక్రయించి రవాణా ఛార్జీలు కూడా ప్రభుత్వమే నిర్ణయించి వినియోగదారులకు తక్కువ ధరకే సరఫరా చేస్తోంది. అయితే ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకోవడంలో మధ్యవర్తుల జోక్యం పెరిగి సామాన్యులకు ఇసుక అందకుండా చేస్తున్నారు. దీంతో వినియోగదారులు నల్లబజారులో ఇసుక అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇసుక బుకింగ్, రవాణాకు లారీల ఎంపికలోనూ సాంకేతిక అంశాలను అనుకూలంగా మార్చుకున్న కొందరు దళారులు ఇసుక బుక్ చేసుకుని అవసరాలు ఉన్న వారికి అమ్ముకుని జేబులు నింపుకొంటున్నారు. అందరికీ అందుబాటులో ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని కొందరు మధ్యవర్తులు నీరుగారుస్తున్నారు. దీంతో అవసరమైన వారికి ఇసుక అందక ఇక్కట్లు పడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తాళ్లాయపాలెం, పల్నాడు జిల్లాలో అచ్చంపేట మండలంలో మాత్రమే ఇసుక రెండు డంపింగ్‌యార్డుల్లో అందుబాటులో ఉంది. అక్కడి నుంచి అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. రోజుకు 2వేల టన్నుల చొప్పున సరఫరా చేసేలా నిర్ణయించి ఆమేరకు బుకింగ్‌కు అవకాశం కల్పిస్తున్నారు. డిమాండ్ మేరకు లభ్యత లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

దోచేస్తున్నారు ఇలా..

ఇసుక బుక్ చేసుకున్న దళారులు వివిధ కారణాలు చెప్పి ఇసుక లారీ వచ్చిన తర్వాత వారు బుకింగ్ చేసిన ప్రాంతంలో కాకుండా వారు ఎవరికైతే అమ్మారో అక్కడ అన్‌లోడ్ చేయిస్తున్నారు. లారీ డ్రైవరు బుక్ చేసిన ప్రాంతం కాదని అడిగితే ఆ ప్రాంతానికి లారీ వెళ్లదని, రోడ్డు చిన్నగా ఉందని, చెక్కలు అడ్డం ఉన్నాయని తదితర కారణాలు చెబుతున్నారు. యాప్‌లో బుక్ చేసిన ప్రాంతంలో ఇసుక అన్‌లోడ్ చేస్తే లారీ యజమానికి ఓటీపీ వస్తుంది. ఈ ఓటీపీ నమోదుచేస్తేనే రవాణా ఛార్జీలు యజమాని ఖాతాకు జమవుతాయి. దళారులు ముందస్తుగా బుకింగ్ చేసుకున్న ప్రాంతంలో కాకుండా వారు అనుకున్న ప్రాంతంలో అన్‌లోడ్ చేయించడంతో లారీ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. గుంటూరు నగరానికి 20 టన్నుల ఇసుక లారీ రవాణా ఛార్జీలతో కలిపి రూ.11900కు వస్తోంది. దీనిని దళారులు రూ.25 వేలకు, తెనాలికి రూ.13 వేలకు లారీ ఇసుక వస్తుండగా రూ.30వేలకు విక్రయిస్తున్నారు. పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దూరాన్ని బట్టి టన్నుల లెక్కన అమ్ముతున్నారు. ఆన్‌లైన్‌లో ఇసుక బుకింగ్ చేసుకునే సమయంలో చిరునామా, విస్తీర్ణం, జియో ట్యాగింగ్ చిత్రాలు ఏది నమోదు చేసినా ఆమోదిస్తుండటంతో దళారులు సులభంగా లబ్ధి పొందుతున్నారు.

దూరం గుర్తించడంలో ఇబ్బందులు

తాళ్లాయపాలెం ఇసుక రీచ్ నుంచి గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్, కృష్ణా, బాపట్ల జిల్లాలకు ఇసుక సరఫరా అవుతోంది. ఇక్కడ ఇసుక బుక్ చేసుకున్న తర్వాత ప్రభుత్వం ఎంపిక చేసిన లారీల ద్వారా రవాణాకు వెసులుబాటు కల్పించారు. ఇందుకు కిలోమీటర్ల వారీగా ప్రభుత్వమే ధరలు నిర్ణయించింది. ఇసుక ధర, రవాణా ఛార్జీలు చెల్లించిన వెంటనే వారికి సరఫరా మొదలవుతుంది. ఈమేరకు ఇసుక బుకింగ్ అయిన తర్వాత లారీ యజమానులు తాము రవాణా చేస్తామని యాప్‌లోనే ఆమోదం తెలపాల్సి ఉంటుంది. తాళ్లాయపాలెం నుంచి వినియోగదారులు కోరిన ప్రాంతానికి దూరాన్ని యాప్ ద్వారానే నిర్ణయిస్తారు. ఇందులో వివిధ కారణాలతో దూరం తగ్గించి నమోదుకావడంతో లారీ యజమానులు రవాణాకు ఆసక్తి చూపడం లేదు. వినియోగదారులకు ఇసుక రవాణాలో జాప్యం జరుగుతోంది. ఉదాహరణకు తాళ్లాయపాలెం నుంచి నున్నకు 15.8 కి.మీ, సూర్యారావుపేటకు 15.87 కి.మీ, సింగ్‌నగర్‌కు 19.78 కి.మీ చూపుతోంది. మంగళగిరి సమీపంలోని జాతీయ రహదారి నుంచి లారీలు వెళ్లే మార్గంలో తాళ్లాయపాలెం డంపింగ్‌యార్డుకు 20 కిలోమీటర్లపైగా దూరం వస్తోంది. దీంతో లారీ యజమానులు యాప్‌లో తక్కువగా దూరం చూపడం వల్ల నష్టం వస్తుందని ఎక్కువమంది రవాణాకు వెనుకడుగు వేస్తున్నారు.

అక్రమార్కులపై చర్యలు

జిల్లాలో తాళ్లాయపాలెం ఇసుక డంపింగ్‌యార్డులో మాత్రమే నిల్వలు ఉండటంతో రోజుకు 2వేల టన్నుల చొప్పున సరఫరా చేస్తున్నాం. దళారులు ఇసుక బుక్ చేసుకుని అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటున్నాం. యాప్‌లో దూరం నిర్ణయించడంలో దగ్గరి దారి తీసుకోవడంతో కొన్ని సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం. అక్టోబరు 15 తర్వాత కొత్త రీచ్‌లు అందుబాటులోకి రావడంతో డిమాండ్ మేరకు సరఫరా చేస్తాం.

- భార్గవ్ తేజ, సంయుక్త పాలనాధికారి, గుంటూరు

పనులు పట్టాలెక్కాలి.. రైళ్లు పరుగెట్టాలి

ఈనాడు డిజిటల్, నరసరావుపేట, న్యూస్‌టుడే, పెదకూరపాడు

ఏళ్లుగా జిల్లా వాసులు వినతులు

రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి ఉన్నతాధికారులు వినతులు స్వీకరించడమే కానీ.. వాటిని ఆచరణలో పెట్టి అమలు చేయడంలో చొరవ చూపించడం లేదు. ఏళ్లుగా జిల్లాలో పలు ప్రాజెక్టులు, స్టాపింగ్‌ల కోసం స్థానికులు ఎంపీతో కలిసి రైల్వే మంత్రి, జీఎంలకు వినతిపత్రాలు సమర్పిస్తున్నా ఆయా ప్రాజెక్టులు మంజూరుకు నోచుకోవడం లేదు. ఇటీవల జరిగిన దక్షిణమధ్య రైల్వే జీఎం అజయ్‌కుమార్‌జైన్‌తో ఎంపీల సమావేశంలో కూడా అడిగిన అన్నింటికీ సావధానంగా విన్నారే తప్పించి వెంటనే మంజూరు చేస్తున్నట్లు ప్రకటనలు వెలువడలేదు. ఈసారైనా ఆయా ప్రతిపాదనలకు మోక్షం కలగాలని జిల్లా వాసులు కోరుకుంటున్నారు.



ద.మ. రైల్వే జీఎం అజయ్‌కుమార్‌జైన్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎంపీ లావు, పెదకూరపాడువాసులు(పాతచిత్రం)

ముఖ్యమైన రైళ్లకు స్టాపింగ్‌లేవీ?

జిల్లా మీదుగా పోయే ముఖ్యమైన రైళ్లు కొన్నిస్టేషన్లలో ఆగడం లేదు. గురజాల, పెదకూరపాడు, నరసరావుపేట, పిడుగురాళ్ల వాసులు ఎక్కువగా హైదరాబాద్‌లో చదువులు, వ్యాపారాలు సాగిస్తుంటారు. వీరంతా తరచూ ప్రయాణాలు చేస్తుంటారు. బస్సుతో పోలిస్తే రైలు ప్రయాణం చవకతోపాటు సమయం ఆదా అవుతుంది. కానీ చాలా రైళ్లకు జిల్లాలోని పలు పట్టణాల్లో హాల్టింగ్ సదుపాయం లేదు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ పెదకూరపాడు రైల్వేస్టేషన్‌లో కేవలం ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. పంచారామక్షేత్రం అమరావతి, ధ్యానబుద్ధ, హైకోర్టు, సచివాలయానికి వెళ్లడానికి పెదకూరపాడు నుంచి దగ్గరదారి. అంతేకాకుండా నియోజకవర్గ వాసులు విద్య, ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ పలు ఎక్స్‌ప్రెస్‌లు ఆగితే ఎంతో ఉపయుక్తం. కనీసం పల్నాడు ఎక్స్‌ప్రెస్, రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌లను అయినా నిలపాలని కొన్నేళ్లుగా నియోజకవర్గ వాసులు రైల్వే ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటున్నారు. తాజాగా విజయవాడలో జరిగిన సమావేశానికి ఎంపీతో కలిసి జీఎంకు మరోసారి వినతిపత్రం ఇచ్చారు. 22 గ్రామాల ప్రజల నుంచి భారీగా సంతకాలను సేకరించి మరీ రైళ్లను ఆపాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

☛ విజయవాడ నుంచి సికింద్రాబాద్ వెళ్లే ఉద్యోగుల ప్రత్యేక రైలుకు నడికుడిలో హాల్టింగ్ ఇవ్వాలని కోరుతున్నారు. ఫలక్‌నుమా, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు ఇక్కడ ఆగవు.

శ్రీకాళహస్తి-నడికుడి మార్గంలో రైలు కూత ఎప్పుడు?

శ్రీకాళహస్తి-నడికుడి 309 కిలోమీటర్ల మార్గం పూర్తయినా ఇంత వరకూ రైలుకూత వినిపించడం లేదు. ఈ మార్గం కరోనాకు ముందే పూర్తిచేశారు. ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. రైల్వేస్టేషన్‌లు నిర్మించారు. అన్నీ సక్రమంగానే ఉన్నా ఇంతవరకూ ప్రయాణికుల రైళ్లు నడవడం లేదు. రైలు కూత మొదలైతే సమీప ప్రాంతాలు అభివృద్ధికి నోచుకుంటాయి. తిరుపతి వెళ్లడానికి దూరం కూడా తగ్గుతుంది.

రైలు గేటుపడితే..

పెదకూరపాడు-సత్తెనపల్లి, సత్తెనపల్లి-అచ్చంపేట, క్రోసూరు, బెల్లంకొండ అడ్డరోడ్డు-బెల్లంకొండ, మాచర్ల ఈ ప్రాంతాల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. ఈ మార్గాల్లో రైలు గేటు పడితే కనీసం ఇరవై నిమిషాలు రాకపోకలు నిలుస్తున్నాయి. గుంటూరు-బీబీనగర్ మార్గం కావడంతో ఎక్కువ రైళ్లు ప్రయాణిస్తుంటాయి. గంటలో ఐదుసార్లు అయినా గేటు పడుతుంది. దీంతో ఏదైనా అత్యవసరమైతే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్ వంటివి అయితే ఇరుక్కుపోవడమే. ఈ మార్గాల్లో ఆర్‌యూబీలు నిర్మించడానికి రైల్వేశాఖ అనుమతులిచ్చినా ఇంతవరకూ టెండర్లు పిలవలేదు.

అమృత్‌భారత్ రైల్వేస్టేషన్లలో మౌలిక వసతులేవీ?

అమృత్‌భారత్ కింద జిల్లాలో నరసరావుపేట, వినుకొండ, నడికుడి, మాచర్ల, సత్తెనపల్లి రైల్వేస్టేషన్లు ఎంపికయ్యాయి. అయితే ప్లాట్‌ఫాంల సంఖ్య పెంచడం దగ్గర నుంచి మంచినీటి సౌకర్యం వరకూ అన్నిరకాల వసతులు మెరుగుపరచాలి. పనులు అయితే ప్రారంభించారు కానీ ఆలస్యంగా నడుస్తున్నాయి. నరసరావుపేటలో అయితే పనులు ఆగిపోయాయి. రెండోనంబర్ ప్లాట్‌ఫాం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రయాణికులు నిల్చోవడానికి నీడ కూడా లేదు. మాచర్ల రైల్వేస్టేషన్‌లో ఇంతవరకూ ఒక్కపని కూడా మొదలు పెట్టలేదు.

ప్రయాణికుల్లా ఆటోలో ఎక్కి.. దోచేసి..



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు, పక్కన సీఐ సుబ్బానాయుడు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రయాణికుల్లా ఆటోలో ఎక్కుతారు.. ఎవరైన వ్యక్తులు అదే ఆటోలో ఎక్కినప్పుడు వారితో డబ్బులు బెట్టింగ్ పెట్టించి మూడుబిల్లల ఆట ఆడిస్తూ వారి వద్ద ఉన్న నగదు, విలువైన వస్తువులు దోపిడీ చేసే అయిదుగురు నిందితుల ముఠాను చిలకలూరిపేట గ్రామీణ పోలీసులు అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ సర్కిల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం డీఎస్పీ నాగేశ్వరరావు విలేకరులకు వివరాలు వెల్లడించారు. గత నెల 28న బాపట్ల జిల్లా మార్టూరు మండలం నాగరాజుపల్లె గ్రామానికి చెందిన బాణావత్ రాంబాబునాయక్ తన మామ రమావత్ బాబునాయక్‌తో కలసి చిలకలూరిపేటలోని గొర్రెల మండి వద్దకు 16 పొట్టేళ్లు తీసుకు వచ్చాడు. అక్కడ వాటిని అమ్మగా వచ్చిన రూ.1.15 లక్షలు జేబులో పెట్టుకుని ఇద్దరు తిరిగి గ్రామానికి వెళ్లేందుకు గొర్రెలమండి ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై ఆటో ఎక్కేందుకు వచ్చారు. అప్పటికే పథకం ప్రకారం నాదెండ్ల మండలం సాతులూరుకు చెందిన ముఠా సభ్యులు బండారు ఏడుకొండలు, శివరాత్రి నాగేంద్రబాబు, జెట్టిపాటి నాగరాజు, శివరాత్రి కొండలు, జెట్టిపాటి శ్రీనులు ఆటో ఆపి ఎక్కడకు వెళ్లాలి అని అడిగి ఎక్కించుకున్నారు. వారిని మాటల్లో దింపి డబ్బులు బెట్టింగ్ పెట్టి మూడు బిల్లల ఆట ఆడేలా చేసి వారి వద్ద నుంచి నగదు దోచుకుని ఇద్దరిని రామచంద్రాపురం పరిధిలో డొంక వద్ద ఆటో నుంచి తోసి పారిపోయారు. బాధితుడు బాణావత్ రాంబాబు నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న చిలకలూరిపేట గ్రామీణ సీఐ సుబ్బానాయుడు, ఎస్సై అనీల్‌కుమార్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.16వేల నగదు, నేరానికి ఉపయోగించిన ఆటో స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సీఐ సుబ్బానాయుడు, ఎస్సై అనీల్‌కుమార్, పీఎస్‌ఐ శివరామకృష్ణ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

గుర్తించిన పనులకు పండగలా భూమిపూజ చేయాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, హాజరైన అధికారులు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: గ్రామసభల్లో గుర్తించిన పనులను పండగ వాతావరణంలో భూమిపూజ నిర్వహించాలని కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం కలెక్టర్ టెలి జిల్లా అధికారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆగస్టు 23న నిర్వహించిన గ్రామసభల్లో గుర్తించిన 719 పనులను రూ.85కోట్లతో చేపట్టేందుకు మంజూరు లభించిందన్నారు. ఈనెల 14 నుంచి 20వరకు రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండగ పంచాయతీ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు ప్రతిపాదించిన పనులకు సైతం శిలాఫలకాలు, భూమి పూజ చేపట్టాలన్నారు. వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి.. వ్యర్థాలతో రూపుమారి


మాచర్ల - సాగర్ రహదారి వెంబడి వ్యర్థాలు

మాచర్ల- నాగార్జునసాగర్ జాతీయ రహదారి వ్యర్థాలమయంగా మారింది. ఇటీవల రహదారి విస్తరించిన ఇరువైపులా జనం వ్యర్థాలు వేస్తున్నారు. మున్సిపల్ సిబ్బంది సకాలంలో తొలగించక నిల్వలు పేరుకుంటున్నాయి. దీంతో చుట్టూ దుర్గంధం వ్యాపించి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని పట్టణవాసులు, వాహనదారులు కోరుతున్నారు.

-ఈనాడు నరసరావుపేట

లింగాకర్షక బుట్టలతో గులాబి పురుగు నివారణ

నాదెండ్ల: పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణకు రైతులు లింగాకర్షక బుట్టలు వినియోగం, రసం పీల్చే పురుగులకు నీలిరంగు, పసుపు అట్టలు వాడాలని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి అన్నారు. మండలంలోని కనపర్రు, అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయ అధికారి హరిప్రసాద్, వెటర్నరీ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

దూరవిద్య.. బంగారు భవిత

న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం, రొంపిచర్ల

వయసుతో సంబంధం లేకుండా చదువుకునే అవకాశం


కరపత్రాల ద్వారా సార్వత్రిక విద్యపై ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

చదువుకు దూరమైన వారు, బడి మధ్యలో మానేసిన వారు పది, ఇంటర్‌లో అనుత్తీర్ణులు, బాల్యవివాహ బాధితులు, వయోజనులైనప్పటికీ మళ్లీ చదువుకునేందుకు ప్రభుత్వం సార్వత్రిక విద్య ద్వారా అవకాశం కల్పిస్తోంది. ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ 2024-25 ఏడాదికి గాను పది, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తోంది. గ్రామీణ యువత, బాలికలు, ఎస్సీ, ఎస్టీలు, ప్రత్యేక అవసరాలు గల వారికి విద్యను చేరువ చేయడమే ఓపెన్ స్కూల్ లక్ష్యం.

గత రెండేళ్ల నుంచి ప్రవేశాలు ఇలా

ఏడాది	పది అభ్యర్థులు	ఇంటర్ అభ్యర్థులు
2022–23	1,121	2,611
2023–24	1,144	2,282

విద్యార్హతలు ఇవే..

పదికి: అక్షరాస్యత ఏదైనా పాఠశాలలో చదివితే టీసీ, రికార్డుషీట్ గానీ ఇవ్వాలి. ఏ పాఠశాలలోనూ ప్రవేశం పొందకపోయినా, ఎటువంటి విద్యార్హత లేకపోయినా పదోతరగతి చదివే సామర్థ్యం ఉంటే ప్రవేశం పొందవచ్చు.

వయోపరిమితి: 2024 ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.

ఇంటర్‌లో అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి ఉత్తీర్ణులవ్వాలి. తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో ఒక దాన్ని ఎంపిక చేసుకోవచ్చు. వయోపరిమితి 2024 ఆగస్టు 31 నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి.

గ్రూపులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ ఉన్నాయి.

ప్రవేశ కాలపరిమితి: ఓపెన్ స్కూల్‌లో ఏ కోర్సులో అయినా రిజిస్ట్రేషన్ పొందిన నాటి నుంచి ఐదేళ్ల వరకు అడ్మిషన్ చెల్లుబాటు అవుతుంది. అభ్యర్థులు 30 శాతం తరగతులకు హాజరవ్వాలి. సాధారణ పాఠశాల, కళాశాల ధ్రువపత్రాలతో దూరవిద్య ఉత్తీర్ణత ధ్రువపత్రాలకు సమాన అర్హతలు కల్పించారు.

దరఖాస్తు ఇలా

పది, ఇంటర్ ప్రవేశాల కోసం https: //apopenschool.ap.gov.in వెబ్‌సైట్‌లో అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. దరఖాస్తు రసీదును ఎంచుకున్న ఓపెన్ స్కూల్ కేంద్రంలో ఇవ్వాలి. ధ్రువపత్రాలు పరిశీలన తర్వాత ప్రవేశం పొందాలి.

ఉచితంగా పాఠ్యపుస్తకాలు

పల్నాడు జిల్లాలో 49 కేంద్రాలు ఉన్నాయి. అభ్యర్థులకు రెండో శనివారం, ఆదివారం, సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తూ, ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించి అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో బోధిస్తున్నారు.

పది, ఇంటర్ చదువుకునే అవకాశం



2024-25 ఏడాదికి పది, ఇంటర్‌లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతోంది. పాఠశాలలో చదువుకునే అవకాశం లేని వారికి, వయోజనులకు సార్వత్రిక విద్యాపీఠం బంగారు భవితను అందిస్తోంది. దూరవిద్యా విధానంలో పది, ఇంటర్ కోర్సులను ఏటా నిర్వహిస్తోంది.

– అక్బర్‌ఆలీ, సార్వత్రిక విద్య రాష్ట్ర సమన్వయకర్త

2025 మార్చి నాటికి అన్ని గ్రామాల్లో చెత్త సేకరణ జరగాలి

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: 15వ ఆర్థిక సంఘం నిధులతో క్లాప్ మిత్రలకు వేతనాలు ఇవ్వాలని, పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి పరిశుభ్ర గ్రామాలుగా ఉండేలా చూడాలని ఆదేశించినా కొన్నిచోట్ల మార్పు రాలేదని జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. 2025 మార్చి నాటికి జిల్లాలోని అన్ని గ్రామాల్లో చెత్తను సేకరించి షెడ్లకు తరలించాలని అధికారులను ఆదేశించారు. వినుకొండ మండల పరిషత్ కార్యాలయంలో ఐదు మండలాల కార్యదర్శులతో పంచాయతీల ఆదాయ వనరులపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీల్లో ఆదాయ వనరులు ఎలా ఉన్నాయి, అవి కార్యదర్శికి తెలిసి ఉండాలని ఉద్దేశంతో జిల్లాలోని పంచాయతీల్లో పనిచేస్తున్న కార్యదర్శులతో కాంప్లెక్స్‌ల వారీగా స్వయంగా తెలుసుకుని వారి నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని చెప్పారు. పారిశుద్ధ్య పనులు అధ్వాన్నంగా ఉన్న చోట్ల కార్యదర్శులకు నోటీసులు జారీ చేయాలని ఈవోపీఆర్డీలను ఆదేశించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీలు సుందరరెడ్డి, జిలానీభాష, సుగుణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్
(యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పాన్సర్ చేసిన ప్రభుత్వరంగ సంస్థ)
అల్లూరివారిపాలెం గ్రామము, నరసరావుపేట మండలం, పల్నాడు జిల్లా, ఎ.పి.-522601. ✆ 9491776345

Lr No. 7999/RONRT/SARFAESI/ 2024-25/ 21 Dated: 08.10.2024

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 యొక్క రూల్ 8(1) ననుసరించి జారీచేయడమైనది)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారము **చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, అల్లూరివారిపాలెం బ్రాంచి** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారుడు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 నందలి సెక్షన్ 13(12)తో చదువుకునే నిబంధన 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీత: 1) శ్రీ గుడిపూడి రామాంజనేయులు, తండ్రి:** బ్రహ్మయ్య, హెచ్.నెం.2-44, పరగటిచెర్ల (గ్రామము), రొంపిచర్ల (మండలం), పల్నాడు (జిల్లా), పిన్‌కోడ్-522615. **2) శ్రీమతి గుడిపూడి లక్ష్మీ రాజేశ్వరి, భర్త: రామాంజనేయులు,** హెచ్.నెం.2-44, పరగటిచెర్ల (గ్రామము), రొంపిచర్ల (మండలం), పల్నాడు (జిల్లా), పిన్‌కోడ్-522615. **హామీదారు: 3) గంటా ప్రసాద్, తండ్రి: రంగయ్య,** హెచ్.నెం.1-67, మెయిన్‌రోడ్డు, పంచాయతీ ఆఫీస్ దగ్గర, పరగటిచెర్ల (గ్రామము), రొంపిచర్ల (మండలం), పల్నాడు (జిల్లా), పిన్‌కోడ్-522615. **తనఖాదారు: 4) శ్రీ గుడిపూడి రామాంజనేయులు, తండ్రి:** బ్రహ్మయ్య, హెచ్.నెం.2-44, పరగటిచెర్ల (గ్రామము), రొంపిచర్ల (మండలం), పల్నాడు (జిల్లా), పిన్‌కోడ్-522615 వార్లను నోటీసులో ఉదహరించబడిన బకాయిసొమ్ము **రూ.1,88,887/- (అక్షరాల ఒక లక్ష ఎనభై ఎనిమిది వేల ఎనిమిది వందల ఎనభై ఏడు రూపాయలు మాత్రమే)** సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **ది.28.06.2024న డిమాండ్ నోటీసు** జారీచేయబడినది.

ఋణగ్రహీత బకాయిసొమ్ము తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు నోటీసు ఇచ్చి, ఈ దిగువ సంతకందారుడు సదరు చట్టములోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన ఆర్డినెన్స్‌తో చదువుకునే రూలు 8 ప్రకారము **8 అక్టోబర్ 2024 తేదీన** దిగువ పేర్కొన్న ఆస్తిని **స్వాధీనత** తీసుకోవడమైనదని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బ్యాంకు వారికి **చెల్లించవలసిన బకాయిసొమ్ము రూ.1,88,887/- (అక్షరాల ఒక లక్ష ఎనభై ఎనిమిది వేల ఎనిమిది వందల ఎనభై ఏడు రూపాయలు మాత్రమే)** మరియు **ది.31.05.2024 తేదీనుండి వడ్డీ, మరియు ఇతర ఛార్జీలు** మొ॥నవి **చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్** వారి నిబంధనలకు లోబడి ఉండునని ఇందుమూలముగా ప్రత్యేకించి ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

సదరు చట్టం 13వ విభాగం యొక్క ఉప విభాగం (8) నియమావళి ననుసరించి సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అవకాశం కలదని ఋణగ్రహీతలకు విన్నవించటమైనది.

ఆస్తి యొక్క షెడ్యూలు

పల్నాడు జిల్లా మరియు నరసరావుపేట రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా నందు 72.747 చ॥గ॥ విస్తీర్ణము గల ఆస్తికి సంబంధించిన యావదాస్తి. పల్నాడు జిల్లా, రొంపిచర్ల మండలం, పరగటిచెర్ల గ్రామము, సర్వే నెం.డి.నెం. 52 నందు **శ్రీ గుడిపూడి రామాంజనేయులు, తండ్రి: బ్రహ్మయ్య పేరునగల** 72.747 చ॥గ॥ విస్తీర్ణము గల స్థలము మరియు అందులోని ఆర్‌సిసి రూఫ్ భవనమునకు సంబంధించిన యావదాస్తి. **షెడ్యూలు ఆస్తికి హద్దులు: తూర్పు:** గల్లీ బజారు హద్దు 16-2 అ॥; **దక్షిణం:** దొప్పలపూడి హనుమంతరావుకు చెందిన ఆస్తి మొ॥ స్థలము; **పడమర:** గుడిపూడి సాంబయ్య ఇల్లు హద్దు 16-2 అ॥; **ఉత్తరం:** గుడిపూడి శ్రీనివాసరావు ఇల్లు హద్దు 40-6 అ॥.

ప్రదేశం: నరసరావుపేట
తేది : 08-10-2024
సం/- ఛీఫ్ మేనేజర్ మరియు అధీకృత అధికారి
చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్

అంతా సర్దుకున్నాక తనిఖీలా!

న్యూస్‌టుడే, వినుకొండ

వ్యవసాయాధికారుల తీరుపై విమర్శలు

వినుకొండలో అనధికార బయో ఉత్పత్తుల గుట్టు బయటపడింది. ఏళ్ల తరబడి సాగుతున్న ఈవ్యవహారంపై వ్యవసాయశాఖాధికారులు తీరిగ్గా ఇప్పుడు శోధన మొదలు పెట్టారు. ఎక్కడి దొంగలు అక్కడే గప్‌చుప్ అన్నట్లు ఈపాటికే వ్యాపారులు వాటిని సర్ది జాగ్రత్తపడ్డారు. 'మాకు కొంత..మీ ఇష్టం అంతా' 'అక్షరంతో ఏమార్చి.. అన్నదాతను దోచేసి' శీర్షికన ఈనాడులో వరుస కథనాల ప్రచురితం కావడంతో తప్పక చర్యలకు ఉపక్రమించారు. మండల వ్యవసాయాధికారి ఆదివారం సీతయ్యనగర్‌లోని కిసాన్ అగ్రిటెక్ కంపెనీలో రికార్డు సక్రమంగా లేనందున రూ.3.14లక్షల విలువైన బయో ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేసినట్లు ప్రకటించారు. మంగళవారం ఇన్‌ఛార్జి ఏడీఏ రవికుమార్ ఆధ్వర్యంలో వెన్నపూస కాలనీలో రెండు వేర్వేరు గోదాములలో అనుమతి లేకుండా తయారు చేస్తున్నట్లు గుర్తించి తనిఖీ చేశారు. ఆ సమయానికి అప్పటికే ఉన్న వాటిని పక్కకు సర్దేశారు. అందులో ఒక దానిలో మాత్రం ద్రావకం ఉన్న మూడు రమ్ములను వదిలేసి వెళ్లడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. నియోజకవర్గ కేంద్రంలో నిర్భీతిగా అనుమతి లేకుండా బయోఉత్పత్తులు తయారు చేస్తుంటే ఇప్పటి వరకు అధికార యంత్రాంగం గుర్తించకపోవడం గమనార్హం.

నకిలీల మయం.. రూ.కోట్లలో వ్యాపారం

బయోఉత్పత్తులు మార్కెట్‌ను ముంచెత్తాయి. వాటిని స్థానికంగా తయారు చేసేది ఇద్దరు, ముగ్గురైతే ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయించేవారు పదుల సంఖ్యలో ఉన్నారు. ఏటా ఒక్క వినుకొండ నియోజకవర్గంలోనే సుమారు రూ.10 కోట్ల వరకు ఈ వ్యాపారం నడుస్తోందని అంచనా. అందులో మూడొంతులు అనధికారికంగా సాగుతోంది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా నుంచి ట్రాన్స్‌పోర్టుల ద్వారా తెచ్చి అమ్ముతున్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న మందు సీసాకు అచ్చుగుద్దినట్లు లేబుల్ వేసి చలామణి చేస్తున్నారు. అందులో ఉన్న మందు ఎలాంటిదో ఎవరికి తెలియదు. పరీక్షలుండవు పట్టించుకునేవారు లేరు... వాటిని కొని రైతులు మోసపోతున్నారు. వినుకొండతో పాటు ఈపూరు మండలం ఇనిమెళ్ల, కొచ్చర్ల, బొల్లాపల్లి మండలం పేరూరిపాడులో వీటికి ప్రత్యేక గోదాములు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అధిక లాభాల ఆశతో వ్యాపారులు వాటిని రైతులకు విక్రయిస్తున్నారు. ఒకర్ని చూసి మరొకరు అన్నట్లు ఇటువంటి జీరో వ్యాపారం చేసే వారు పెరిగిపోవడంతో మార్కెట్‌లో మాయాజాలంగా మారింది. క్షేత్ర స్థాయి నుంచి ఆపైవరకు అందరికీ తెలిసే నడుస్తుందని చెబుతున్నారు. గత ప్రభుత్వంలో ఓ అధికారి తనకు సంబంధించిన వారి కంపెనీ బయోఉత్పత్తులను వ్యాపారులపై ఒత్తిడి తెచ్చి అమ్మించారన్న ఆరోపణలున్నాయి. ఇటువంటి అనైతిక చర్యలపై ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరిస్తే తప్ప నకిలీలను కట్టడి చేయడం సులువుకాదు.

కనుల పండువగా కుంకుమార్చన


చిలకలూరిపేట సాదినేని చౌదరయ్య కల్యాణ మండపంలో కుంకుమార్చన


పూజలో పాల్గొన్న మహిళలు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేట సాదినేని చౌదరయ్య కల్యాణ మండపంలో ధనలక్ష్మి గ్రూపు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి సువాసినులతో కుంకుమార్చన నిర్వహించారు. వందలాది మంది మహిళలు కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ధనలక్ష్మి గ్రూప్ సంస్థల డైరెక్టర్ పేర్ని వీరనారాయణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం మహిళా భక్తులందరికీ చీరలు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

ప్రమాదకరంగా గ్రానైట్ రాళ్ల తరలింపు

గ్రానైట్ క్వారీల నుంచి పెద్ద బండరాళ్లు తరలిస్తున్న సమయంలో నిబంధనలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని మురికిపూడి పరిధిలో ఉన్న క్వారీల నుంచి నిత్యం ముడిరాయి తీసుకొని లారీలు గ్రామం మీదుగా తిరుగుతున్నాయి. 40 టన్నులకు పైగా బరువు ఉన్న రాళ్లను ప్రమాదకర పరిస్థితుల్లో తరలిస్తున్నారు. ఇటీవల మురికిపూడిలో రెండుసార్లు లారీల పైనుంచి పెద్ద బండరాళ్లు కిందపడ్డాయి. త్రుటిలో ప్రమాదం తప్పింది. పలుమార్లు గ్రానైట్ నిర్వాహకులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

-న్యూస్‌టుడే, చిలకలూరిపేట గ్రామీణ


మురికిపూడిలో పడిపోయిన రాళ్లను వాహనంపైకి చేర్చుతున్న క్రేన్

ప్రకృతి వ్యవసాయంతో నేల ఆరోగ్యం


బెల్లంకొండలో వరి దిబ్బుల మధ్య వ్యత్యాసం చూపుతున్న డీపీఎం అమలకుమారి

బెల్లంకొండ, న్యూస్‌టుడే : ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరి పొలాలను ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి సందర్శించారు. మంగళవారం బెల్లంకొండ, నాగిరెడ్డిపాలెంలో వరి పంట పొలాల్ని ఆమె సందర్శించి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న వరిపంట దుబ్బులు, రసాయన విధానంలో సాగు చేస్తున్న దుబ్బులను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వరిలో ఒక దుబ్బుకు 23 పిలకలు ఉండగా.. అదే రసాయన పద్ధతి వరి దుబ్బులకు 10 మాత్రమే ఉన్నట్లు గుర్తించామన్నారు. అదే విధంగా వేరు పొడవు కూడా చాలా వ్యత్యాసం ఉన్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో రసాయనాలు వాడరు కనుక నేలలో వానపాములతో పాటు అనేక రకాల సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది నేలను గుల్ల పరుస్తాయని, తద్వారా నేల ఆర్యోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. మొక్కలు కూడా ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. మోడల్ మెండల్ తిమాటిక్ లీడ్ పవన్‌కుమార్, ఎంటీలు అనంతలక్ష్మి, అంజలి, యూనిట్ ఇన్‌ఛార్జులు మాధవి, జ్యోతి, నాగేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపిక


నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధికారి తమ్మాజీరావు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నరసరావుపేట న్యాక్ ట్రైనింగ్ సెంటర్‌లో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. మేళాకు ఐదు సంస్థల ప్రతినిధులు హాజరై ఎంపికలు చేపట్టారు. 80 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కంపెనీల ప్రతినిధులు వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించి 32 మందిని ఎంపిక చేసి నియామకపత్రాలు అందజేశారు. న్యాక్ సెంటర్ ఏడీ నరసింహారావు, అదనపు జిల్లా అధికారి రామాంజనేయులు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి రవీంద్రనాయక్ తదితరులు ఉన్నారు.

సామూహిక అత్యాచారం కేసులో.. జైలు

గుంటూరు లీగల్: భర్తతో కలిసి వెళ్తున్న ఓ వివాహితపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఓ ముఠాలోని ఇద్దరికి 20 ఏళ్లు, మరొకరికి మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.నీలిమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణం, సమీపం చినకుదురుకు చెందిన ఆకుల లింగమయ్య, దాసరి ఓబులేశు, ఇండ్ల రమణ, దాసరి సుంకన్నతో పాటు మరో మైనర్ రాష్ట్ర వ్యాప్తంగా పలు నేరాలకు పాల్పడ్డారు. దారిదోపిడీలకు పాల్పడి మహిళలపై దాడులు చేసేవారు. 2021 సెప్టెంబరు 8న పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన భార్యాభర్తలు మేడికొండూరు సమీపంలోని పాలడుగులో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్రవాహనంపై తిరిగి ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యలో చెట్టుకొమ్మలను అడ్డంగా వేయడంతో ద్విచక్రవాహనం నెమ్మదించగా.. మాటున వేసిన నిందితులు చీకట్లో నుంచి రోడ్డుపైకి వచ్చి వారిపై కర్ర విసరడంతో వాహనం నుంచి కిందపడ్డారు. వేటకొడవళ్లతో దాడిచేసి సమీపంలోని పొలాల్లోకి లాక్కెళ్లి వారి వద్ద ఉన్న నగదు, బంగారం దోచుకున్నారు. అర్ధరాత్రి వరకు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. మరుసటిరోజు ఆమె మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ సంఘటన జరిగిన కొద్దిరోజులకు నిందితులు యడ్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో మరో నేరానికి పాల్పడటంతో అక్కడి పోలీసులు వీరిని అరెస్టు చేసి ఆరా తీయగా ఈ నేరం కూడా వారే చేసినట్లు నిర్ధారించారు. ఈ మేరకు నలుగురు నిందితులను అరెస్టు చేయగా మరో నిందితుడు దాసరి సుంకన్న పరారీలో ఉన్నారు. బాలుడిపై కేసును ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. నిందితులు లింగమయ్య, ఓబులేశులపై అత్యాచారం నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.66వేల జరిమానా విధించారు. మరో నిందితుడు రమణకు మూడేళ్ల జైలు శిక్ష రూ.5వేలు జరిమానా విధిస్తూ జడ్జి నీలిమ తీర్పు చెప్పారు.

బాధిత కుటుంబాలకు ఆసరా

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట): అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు కుటుంబాలకు తోటి హోంగార్డులు ఒక రోజు వేతనం అందించి ఆసరాగా నిలవడం అభినందనీయమని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ శివ కామేశ్వరరావు, నరసరావుపేట ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ మల్లికార్జునరావు అనారోగ్యాలతో మృతిచెందిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబసభ్యులకు రూ.ఐదు లక్షల చెక్కు ఎస్పీ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు.

మానసిక బాధతో వెళ్లా..

అదృశ్యమైన వీఆర్వో ప్రత్యక్షం

ముప్పాళ్ల: మానసిక బాధతో తాను ఎవరికీ చెప్పకుండా దూర ప్రాంతాలకు వెళ్లి వచ్చినట్లు నార్నెపాడు వీఆర్వో మల్లికార్జునరావు ఎస్సై సోమేశ్వరరావుకు వివరించారు. గత నెల 30 నుంచి ఆయన కనిపించ లేదు. పోలీసులు ఆచూకీ తెలుసుకునేందుకు ప్రత్యేక బృందాల్ని ఏర్పాటు చేశారు. రెండు రోజుల క్రితం తాను కన్యాకుమారికి వెళ్తున్నట్లు నార్నెపాడుకు చెందిన స్నేహితుడు ఫకీరయ్యకు వీఆర్వో తెలియజేయగా అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఆయన స్నేహితుల ద్వారా సమాచారం ఇవ్వగా వీఆర్వో మంగళవారం ఉదయం స్టేషన్‌కు వచ్చారు. అదృశ్యమయ్యేందుకు కారణాలను ఆయన్ను అడిగి ఎస్సై తెలుసుకుని, అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసాద్ ఎదుట హాజరుపరిచారు. మానసిక ఒత్తిడి ఉన్నప్పుడు దూరప్రాంతాలకు ప్రయాణం చేస్తానని ఆయన చెప్పగా ఇంకెప్పుడు అలా చేయవద్దని, కుటుంబ సభ్యులు, అధికారులకు సమాచారం ఇచ్చి వెళ్లాలని ఎస్సై సూచనలు చేసి పంపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో /కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.90/-.

నగ్న వీడియోలు తీసి బెదిరిస్తున్నారని ఫిర్యాదు

నరసరావుపేటటౌన్, న్యూస్‌టుడే: తన భర్తతో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళను వారించినందుకు, కుటుంబ సభ్యులతో వచ్చి దాడి చేశారని, నగ్న వీడియోలు తీసి బెదిరిస్తున్నారని చిలకలూరిపేటకు చెందిన బాధిత మహిళ డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. చిలకలూరిపేట పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటంలేదని వాపోయింది. తనను చంపుతానని బెదిరిస్తున్నారని, నాకు, నా భర్తకు విడాకులు వచ్చి 5 నెలలు అయిందని, విడాకులు వచ్చినా తనను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. డీఎస్పీని కలిస్తే చిలకలూరిపేట పోలీసులను కలవాలని చెప్పారని, అక్కడికి వెళ్లి కలిస్తే వారు తన విషయం పక్కన పెట్టి వేరే విషయాలు మాట్లాడి పంపిస్తున్నారని వాపోయింది. తిరిగి డీఎస్పీని కలిసేందుకు వచ్చానని, గ్రీవెన్స్‌కి ఎన్నోమార్లు ఫిర్యాదు చేశానని అయినా ఫలితం లేదని మహిళా కమిషన్ స్పందించి న్యాయం చేయాలని వేడుకుంది.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

పంచాయతీ పాలనపై అవగాహన ఉండాలి

నూజెండ్ల, న్యూస్‌టుడే: పంచాయతీ పాలనపై సర్పంచులకు అవగాహన ఉండాలని ఎంపీడీవో ఉమాదేవి అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో మంగళవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ నిర్వహించారు. పంచాయతీ పాలకవర్గం వారి బాధ్యతలు సక్రమంగా నిర్వహించి ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని కోరారు.

యడ్లపాడు, న్యూస్‌టుడే: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ నిర్వహించారు. గ్రామ పంచాయతీ పరిపాలన, ఆదాయ వనరులు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా నిర్వహణపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో హేమలతాదేవి, ఈవోపీఆర్ అండ్ ఆర్డీ జాకీర్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే వృత్తిలో రాణింపు

వినుకొండ, న్యూస్‌టుడే: వృత్తిలో నైపుణ్యంతోనే రాణించగలరని మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జునరావు తెలిపారు. కారంపూడి రోడ్డులోని బృందావనంలో మంగళవారం ఫొటోగ్రాఫర్లకు నిర్వహించిన వర్క్‌షాపులో ఆయన మాట్లాడారు. డిజిటల్ రంగం ప్రాధాన్యం పెరిగిందన్నారు. అనంతరం వివిధ పోటీలలో అవార్డులు అందుకున్న బి.శంకర్రావు, సుబ్రహ్మణ్యం, కేసానుపల్లి సుబ్బారావుతోపాటు వర్క్‌షాపు మెంటార్‌గా వ్యవహరించిన ప్రవీణ్‌హుస్సేన్‌ను సన్మానించారు. న్యాయవాది ముప్పాళ్ల జ్ఞానేశ్వరావు, సంఘం కార్యదర్శి శ్రీకాంత్, గోవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008146652 వినుకొండ గ్రామీణ : 9440009293

? నరసరావుపేట కోడెల శివప్రసాదరావు కాలనీలో పగలే వీధి దీపాలు వెలుగుతున్నాయి. - శ్రీను, స్థానికుడు

✔ వార్డు సిబ్బందికి తెలియజేసి సమస్య పరిష్కరిస్తాం. - శేఖర్, వీధిదీపాల పర్యవేక్షణాధికారి, నరసరావుపేట - మల్లమ్మసెంటర్

? రొంపిచర్ల నుంచి నరసరావుపేట వెళ్లే మార్గంలో తుంగపాడు వద్ద రోడ్డు గుంతలు పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. - సాయితేజ, రొంపిచర్ల

✔ మరమ్మతులకు చర్యలు తీసుకుంటాం. - గణేష్‌కుమార్, రోడ్లు భవనాలశాఖ ఏఈ - రొంపిచర్ల

రేషన్ అక్రమాలకు అడ్డేది!

యథేచ్ఛగా తరలుతున్న బియ్యం

రెండురోజుల క్రితం నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం వద్ద గ్రామీణ పోలీసులు తనిఖీల్లో 80 బస్తాల రేషన్ బియ్యం తరలిస్తున్న లారీ పట్టుబడింది. నరసరావుపేట, నకరికల్లు తదితర ప్రాంతాల్లో సేకరించిన బియ్యం 55 బస్తాలు తరలిస్తున్న వాహనాన్ని గత నెల 16న జొన్నలగడ్డ వద్ద గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. వీటిని పిరంగిపురం మండలం బేతపూడికి తరలిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది

20 రోజుల క్రితం నరసరావుపేటలో కార్డుదారుల నుంచి సేకరించిన రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టణంలోని వినుకొండ రోడ్డులో నవయుగ రెస్టారెంట్ సమీపంలో గ్రామీణ పోలీసులు పట్టుకున్నారు. ఆ బియ్యం చిలకలూరిపేటకు తరలిస్తున్నట్లు డ్రైవర్ తెలిపాడు.

న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్

జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అంతులేదు. నిత్యం రేషన్ అక్రమంగా తరలిపోతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. జిల్లాలో 6,45,110 మంది కార్డుదారులు ఉన్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ ప్రాంతాల నుంచే రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగుతున్నట్లు అధికారులు తనిఖీల్లో పట్టుకున్న వాహనాలను పరిశీలిస్తే అర్థమవుతోంది.


పోలీసులు పట్టుకున్న రేషన్ బియ్యం లారీ

బియ్యానికి బదులు డబ్బులు ఇస్తాం..

జిల్లాలో రేషన్ డీలర్లు ఏకంగా బియ్యం ఇవ్వం... డబ్బులు ఇస్తాం... తీసుకుంటే తీసుకోండి లేదంటే లేదని కార్డుదారులకు చెబుతున్నారు. నరసరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో కిలో బియ్యం రూ.15 చెల్లించి కార్డుదారుల వద్ద నుంచి డీలర్లే కొనుగోలు చేసి బయట మార్కెట్లలో కిలో బియ్యం రూ.19కు అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో అక్రమార్కులు ఒకటో తేదీ నుంచే రేషన్ డీలర్ల వద్ద మకాం వేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నా రెవెన్యూ, పౌరసరఫరాల శాఖల అధికారులు పట్టించుకోవటంలేదు. ఒకటో తేదీ నుంచి పదో తేదీ వరకు అధికారులు రేషన్ షాపులను తనిఖీ చేయాల్సి ఉండగా వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు. రాత్రికి రాత్రి బియ్యం తరలిస్తున్నా అధికారులు తనిఖీలు చేయకపోవడం గమనార్హం. రేషన్ బియ్యం అక్రమ రవాణా విషయమై డీఎస్‌వో పద్మశ్రీని 'న్యూస్‌టుడే' వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

అంతరిక్ష పరిశోధనలకు దిక్సూచి కలాం

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: అంతరిక్ష పరిశోధనల్లో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం దిక్సూచి వంటివారని వక్తలు పేర్కొన్నారు. నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా మంగళవారం కలాం విగ్రహావిష్కరణ చేశారు. షార్ ఉపసంచాలకులు, సీనియర్ శాస్త్రవేత్త జీ గ్రహదురై కలాం విగ్రహాన్ని ఆవిష్కరించి ఘననివాళులు అర్పించారు. ఉపగ్రహాల తయారీలో కలాం సేవలను విద్యార్థులకు వివరించారు. చంద్రయాన్ ప్రయోగాల సందర్భంలో ఎదురైన వాతావరణ సమస్యలు వాటిని అధిగమించిన తీరును విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి కోటేశ్వరరావు, వైస్‌ఛైర్మన్ ఎంఎస్ చక్రవర్తి, కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు.


కలాం విగ్రహం వద్ద సీనియర్ శాస్త్రవేత్త గ్రహదురై, మిట్టపల్లి తదితరులు

చెట్ల పెంపకంతో అదనపు ఆదాయం

శావల్యాపురం: ఉద్యాన మొక్కలు, అడవి జాతి మొక్కలను వ్యవసాయ భూమిలో నాటితే రైతులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ట్రీస్ ఔట్సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా కార్యక్రమ పర్యవేక్షకుడు మారవల్లి ప్రణీత్ వర్మ తెలిపారు. మంగళవారం శావల్యాపురం మండలం కారుమంచిలో అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకం కార్యక్రమం కింద రైతులకు అవగాహన, శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెట్ల పెంపకం వల్ల మూడేళ్లకు రైతుకు అదనపు ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. సర్పంచి మల్లాపరపు గాలెయ్యా, మాజీ ఎంపీపీ యరమాసు కోటేశ్వరరావు, సొసైటీ మాజీ డైరెక్టరు శివప్రసాద్, తదితరులున్నారు.


మాట్లాడుతున్న ప్రణీత్ వర్మ

రాయితీపై టమాటాలు

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే: చిలకలూరిపేట రైతుబజారులో మంగళవారం నుంచి టమాటాలు రాయితీపై కిలో రూ.50కే సరఫరా చేస్తున్నట్లు జిల్లా సంయుక్త పాలనాధికారి సూరజ్ గనోరే ప్రకటనలో పేర్కొన్నారు. 'టమాటా ధర మోత' శీర్షికన ఈనాడులో వచ్చిన కథనానికి జేసీ స్పందించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో ఒక్కొక్క కుటుంబానికి కిలో మాత్రమే రాయితీపై టమాటాలు అందజేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు ఆధార్ లేదా రేషన్‌కార్డు నకలును చూపించాలన్నారు.

ఈనాడు కథనానికి స్పందన

పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలి

నరసరావుపేటసెంట్రల్: పట్టణాన్ని శుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే అరవిందబాబు అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలో పలు వార్డుల్లో పర్యటించారు. ఈసందర్భంగా ప్రధాన వీధులను శుభ్ర పరచడం, వార్డుల్లో చెత్త సేకరణను పరిశీలించారు. వారంలో నాలుగు రోజులు పారిశుద్ధ్య పనులు తనిఖీలు చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు.

బాధ్యతల స్వీకరణ

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండలంలో పలువురు అధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్‌గా ఎన్.అనూరాధ, సీనియర్ అసిస్టెంట్‌గా రాజ్యలక్ష్మి, ఈవోపీఆర్ అండ్ ఆర్డీగా షేక్ జాకీర్‌హుస్సేన్, కారుచోల వీఆర్వోగా కేపీ చారి, జాలాది వీఆర్వోగా ఏపీ బాషా, ఉన్నవ వీఆర్వోగా కె.అశోక్, కొండవీడు వీఆర్వోగా డి.కృష్ణచైతన్య, యడ్లపాడు-2 వీఆర్వోగా ఎం.రఫీలయ్య, చెంఘీజ్‌ఖాన్‌పేట వీఆర్వోగా వై.బాబూరావు, వంకాయలపాడు వీఆర్వోగా శివకోటేశ్వరరావు, మైదవోలు వీఆర్వోగా పి.అనూష మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: వినుకొండ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.పుట్టారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సమయంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన నరసయ్య ప్రకాశం జిల్లాకు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి నూజెండ్ల ఎంపీడీవో వీరభద్రాచారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ముప్పాళ్ల మండల ఎంపీడీవోగా పని చేస్తున్న పుట్టారెడ్డిని వినుకొండకు బదిలీ చేశారు.

చౌక బియ్యం అక్రమ తరలింపుపై కేసు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: చిలకలూరిపేటలో అక్రమ రేషన్ బియ్యం తరలింపుపై కేసు నమోదు చేసినట్లు డీఎస్‌వో పద్మశ్రీ మంగళవారం పేర్కొన్నారు. మొత్తం 50 కిలోల బస్తాలు 78 స్వాధీనం చేసుకున్నామన్నారు. వాహనంలో ఉన్న శ్రీను, డ్రైవర్ పురుషోత్తం, అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న ఏలియాను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు, వాహనాన్ని సీజ్ చేసి 6ఎ కేసు పెట్టినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా నిరంతరం పౌరసరఫరాలు, రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో నిరంతరం తనిఖీలు చేస్తూ అక్రమాలకు పాల్పడే డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, రైస్‌మిల్లర్లు, అక్రమార్కులపై 2023 నుంచి ఇప్పటి వరకు 154 కేసులు నమోదు చేసి 2743.91 క్వింటాళ్ల బియ్యం సీజ్ చేసినట్లు తెలిపారు. సదరు వ్యక్తులపై క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

శాంతి ఆశ్రమంలో విశిష్ట పూజలు

వినుకొండ రూరల్, న్యూస్‌టుడే: విఠంరాజుపల్లిలోని శాంతి ఆశ్రమం వద్ద జరుగుతున్న దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆరోరోజు మంగళవారం హిమాలయ గురూజీ 1008 కలశాలతో శంబాలా నగరం పూజ నిర్వహించారు. ఉదయం రాజశ్యామల యాగం, కుంకుమ పూజ చేసి కలశాలతో ప్రత్యేక పూజలు చేశారు. మహిళా పాల్గొని కలశ పూజకు హారతులు పట్టారు. సర్వలోక కల్యాణానికి హిమాలయ గురూజీ తొమ్మిది రోజులు మౌనదీక్ష చేస్తున్నారని ట్రస్టు సభ్యులు తెలిపారు.


కలశ పూజకు హారతులు ఇస్తున్న మహిళలు

గోపిరెడ్డి పేరు కొనసాగింపుపై అభ్యంతరం

నరసరావుపేటసెంట్రల్, న్యూస్‌టుడే: స్వర్గపురి అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేరు కొనసాగింపుపై స్థానికులు మంగళవారం అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టణంలో రజక సామాజిక వర్గానికి చెందిన ఓ మహిళ రెండురోజుల క్రితం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు స్వర్గపురి అభివృద్ధి కమిటీ వారి వద్ద రూ.500 చెల్లించి రసీదు పొందారు. సదరు రశీదుపై స్వర్గపురి అభివృద్ధి కమిటీ గౌరవాధ్యక్షునిగా మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి పేరు ఉండటంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

మండలంలో నిండుకున్న డీఏపీ నిల్వలు

శావల్యాపురం, న్యూస్‌టుడే: ఈ ఏడాది రైతులకు సరిపడా డీఏపీ ఎరువు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మండలంలోని కారుమంచి, శావల్యాపురం సొసైటీ, మన గ్రోమోర్, రైతు సేవా కేంద్రాల్లో నిల్వలు నిండుకోవడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. గతంలో ఈ పరిస్థితి లేదని, అధికారులు ముందస్తు చర్యలు చేపట్టకపోవడంతో కనీసం రైతు సేవా కేంద్రాలకు సరిపడా ఎరువులు రాలేదని రైతులు వాపోతున్నారు.

నిర్దేశిత లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి

శావల్యాపురం, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పరిస్థితిని వైద్యాధికారులకు తెలియచేయాలని, అలాగే ప్రభుత్వ నిర్దేశిత ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన లక్ష్యాలను ఆశా కార్యకర్తలు సకాలంలో పూర్తి చేయాలని శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మన్నెం రాధాకృష్ణన్ తెలిపారు. మంగళవారం ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో గర్భిణులు, పిల్లల నమోదు, వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

వృత్తి నైపుణ్య శిక్షణపై అవగాహన


రొంపిచర్ల, న్యూస్‌టుడే: వృత్తివిద్యలో నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని వి.రెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.రవినాయక్ అన్నారు. ఏపీ మోడల్ కాలేజీ విద్యార్థులకు మంగళవారం సమగ్ర శిక్షణ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనాలపై వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చారు. ఒకేషనల్ కోర్సు సమన్వయకర్త రిషికేష్, శిక్షకురాలు నీలం తిరుమల, విద్యార్థులు పాల్గొన్నారు.


తిమ్మాయిపాలెం వద్ద ధ్వంసమైన రోడ్డు


కుమ్మరిపాలెం వద్ద గుంతలమయంగా..

అధ్వానదారులు.. అవస్థల ప్రయాణం

వినుకొండ రూరల్: వినుకొండ నుంచి దొండపాడు వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు గుంతలు పడి కంకర తేలి అధ్వానంగా తయారైంది. ఐదేళ్లుగా ఈ రోడ్డు నుంచే ఐదు గ్రామాలకు చెందిన ప్రయాణికులు ఇబ్బందులు పడుతూ రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలు లోతుగా పడి నీరు నిలిచి వాహనదారులకు తీవ్ర కష్టతరంగా మారింది. కూటమి ప్రభుత్వంలోనైనా రోడ్డు బాగు చేసి కష్టాలు తీరుస్తారేమోనని ఆశగా ఎదురు చూస్తున్నారు. దీనిపై పీఆర్ ఏఈ నాగేశ్వరరావును వివరణ కోరగా రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని.. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని చెప్పారు.


అసంపూర్తిగా నిర్మించిన సర్వీస్ రోడ్డు

ఈ రోడ్డుకు మోక్షం ఎప్పటికో..?

యడ్లపాడు, న్యూస్‌టుడే : 16వ నంబరు జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు యడ్లపాడు వద్ద అసంపూర్తిగా నిర్మించారు. హైవే రహదారిని ఆరు వరుసలుగా విస్తరించే సమయంలో భూసేకరణ సమస్యతో రోడ్డును అసంపూర్తిగా నిర్మించారు. దీంతో పదేళ్లుగా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. కోర్టు వివాదంలో ఉన్న స్థలంలో కూడా సర్వీస్ రోడ్డు నిర్మించకుండా అలాగే వదిలేశారు. వర్షాలు కురిసిన సమయంలో వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్డును పూర్తి స్థాయిలో నిర్మించి ఇక్కట్లు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇర్లపాడులో అభివృద్ధి పనులకు శ్రీకారం

శావల్యాపురం : ఇర్లపాడు పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు సర్పంచి రమాదేవి తెలిపారు. మంగళవారం సీసీ రోడ్డు ఏర్పాటుకు భూమి పూజ చేశారు.

పురుగుమందు తాగిన వ్యక్తి మృతి

నరసరావుపేటసెంట్రల్: మద్యానికి బానిసై పురుగుమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని పెద్దచెరువుకు చెందిన తమ్మిరాజు(35) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో అతనికి కుటుంబసభ్యులతో వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఈ నెల 5వ తేదీన లింగంగుంట్ల సమీపంలో మద్యంలో పురుగుమందు కలుపుకొని తాగి చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు అక్కడికి చేరుకొని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు గుంటూరు తీసుకెళ్లాలని సూచించారు. బాధితుడిని గుంటూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సిరుల తల్లి.. కల్పవల్లి

న్యూస్‌టుడే, బృందం: దేవీ శరన్నవరాత్రులు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నారు. భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమపూజలు, అలంకరణలు చేపడుతున్నారు. మంగళవారం మహాలక్ష్మి రూపంలో అలంకరణ చేపట్టారు. ఆలయాల వద్ద ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది.


పాతూరులో భీమలింగేశ్వరాలయంలో మహాలక్ష్మీగా..


రామిరెడ్డిపేటలో ధనలక్ష్మీగా బాలచౌడేశ్వరి


నరసరావుపేట వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో లక్ష్మీదేవిగా


రొంపిచర్లలో ధనలక్ష్మిగా


కన్యకాపరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చన


చిలకలూరిపేట దాసరి కాలనీలో అమ్మవారు


యడ్లపాడు: లింగారావు పాలెం శివాలయంలో..


బొప్పూడి రేణుకాదేవి ఆలయంలో..



గడియారస్తంభం వద్ద మహాలక్ష్మిగా


వినుకొండలో అమ్మవారి అలంకారం


విఠంరాజుపల్లిలో మహాలక్ష్మీదేవిగా


జడ్డావారిపాలెంలో శ్రీమహాలక్ష్మీదేవిగా..


గంటావారిపాలెంలో అమ్మవారి అలంకరణ


చిలకలూరిపేట శారదాంబ ఆలయంలో..

సత్తెనపల్లి

• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

పంచాయతీ అభివృద్ధిలో వార్డు సభ్యులే కీలకం

పెదకూరపాడు : ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల గుర్తింపు, గ్రామ సమస్యల పరిష్కారంలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికల రూపకల్పనపై మంగళవారం ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈవోపీఆర్డీ శరత్‌బాబు, ఏపీవో కోటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి గ్రామీణ : పంచాయతీల్లో అభివృద్ధి జరగాలంటే ఆర్థిక వనరుల సమీకరణపై స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని డీఎల్‌డీవో రాజగోపాల్ అన్నారు. సత్తెనపల్లి మండలం లోని 13 పంచాయతీల ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండ్రోజుల శిక్షణ మంగళవారం ముగిసింది. పంచాయతీల్లో పాలన విధానం, మౌలిక వసతుల కల్పన, ఆర్థిక వనరుల సమీకరణ అంశాలపై అధికారులు అవగాహన కల్పించారు. ఎంపీడీవో బి.శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఏఈ సింగ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆ అర్హత వైకాపా నేతలకు లేదు

అమరావతి : గత వైకాపా ప్రభుత్వంలో నాసిరకం మద్యం సరఫరా చేసి ప్రజల ప్రాణాలు తీసి ఎంతో మంది మహిళలకు అన్యాయం చేసిన వైకాపా నేతలకు కూటమి ప్రభుత్వ మద్యం విధానంపై మాట్లాడే అర్హత లేదని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ విమర్శించారు. మంగళవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ మద్య నిషేధం చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్.. సొంత మద్యం సంస్థలు పెట్టి నాసి రకమైన మద్యాన్ని సరఫరా చేసి ప్రజల రక్తమాంసాలు పీల్చారని ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం నూతన మద్యం మద్యం విధానం తెచ్చి పారదర్శకంగా నిర్వహించడానికి ప్రయత్నిస్తుంటే.. వైకాపా నేతలు చౌకబారు విమర్శలు చేస్తున్నట్లు చెప్పారు.

మద్యం టెండర్లు స్వేచ్ఛగా వేసుకోండి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : సత్తెనపల్లిలో మద్యం టెండర్లు స్వేచ్ఛగా వేయనీయకుండా కొందరు సిండికేట్ అయ్యి బెదిరిస్తున్నారని, అలాంటివారు స్థానిక ఎమ్మెల్యే పేరును దుర్వినియోగం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకటసాంబశివరావు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అనైతిక కార్యకలపాలను ఎమ్మెల్యే ప్రోత్సహించరని, వ్యాపారులకు ఆయన అండగా ఉంటారని పేర్కొన్నారు. మద్యం టెండర్లు స్వేచ్ఛగా ఎవరైనా వేసుకోవచ్చని, ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

ఆసుపత్రిలో ఆగంతుకుడి ప్రవేశం

క్రోసూరు (అచ్చంపేట) న్యూస్‌టుడే : క్రోసూరు ప్రభుత్వ ఆసుపత్రికలోకి ఓ ఆగంతుకుడు బుర్కా ధరించి హాలులోకి ప్రవేశించడం సోమవారం మధ్యాహ్నం కలకలం రేపింది. అతను ఎందుకు అలా ప్రవర్తించాడో తెలియక సిబ్బంది, రోగులు ఆశ్చర్యానికి గురయ్యారు. సిబ్బంది అతన్ని పోలీసులకు అప్పగించారు. వారు విచారిస్తున్నట్లు సమాచారం.

కూడలిలో కదలాలంటే ఇబ్బందులే..



పట్టణంలోని లక్కరాజుగార్లపాడు బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్ ఇబ్బందులు ప్రజల్ని వేధిస్తున్నాయి. ఆక్రమణలతో కుంచించుకుపోయిన రోడ్లు, అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన వ్యాపారాలతో వాహనాలు ముందుకు కదలడం లేదు. పెద్ద వాహనం వస్తే ట్రాఫిక్ వెతలు తీవ్రంగా ఉంటున్నాయి. పోలీసులు దృష్టి సారించాలని స్థానికులు కోరుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, సత్తెనపల్లి

ఇక నిత్య పూజలు

✦ ధూప, దీప, నైవేద్యాలకు ఆర్థిక సాయం
✦ జిల్లాలో 203 ఆలయాలకు లబ్ధి

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వం ఇచ్చిన మరో హామీ నెరవేర్చింది. హిందూ ధర్మ పరిరక్షణలో భాగంగా ఆదాయం లేని దేవాలయాల్లో ధూప, దీప, నైవేద్యాలకు సాయం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. 2015లో తెదేపా హయాంలో రూ.2,500గా ఉన్న సాయాన్ని రూ.5 వేలకు పెంచారు. మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత మరోసారి చంద్రబాబు ప్రభుత్వమే గతంలో ఇచ్చిన సాయాన్ని రెండింతలు చేసి గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. ఈ నెల నుంచే ధూప, దీప, నైవేద్య సాయం ఆలయాలకు అందబోతోంది. ప్రైవేట్ ఆలయాలకు సైతం సాయం అందించడంపై ప్రతిపాదనలు వెళ్లాయి. ఉన్నతస్థాయిలో దీనిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

☛ జిల్లాలో ప్రముఖ ఆలయాలు వేళ్లపై లెక్కించదగిన విధంగా ఉంటే ఆదాయం లేని.. వార్షిక ఆదాయం రూ.50 వేల లోపు ఉన్నవి వందల్లో ఉన్నాయి. ఆదాయ వనరులు లేని చోట దాతలు కమిటీలుగా ఏర్పడి అర్చకులను నియమించారు. మరి కొన్ని చోట్ల పండగల సమయంలోనే అర్చకులను పెట్టి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయాలకు శిఖర ప్రతిష్ఠ చేసిన వాటికి కచ్చితంగా నిత్యం ధూప, దీప నైవేద్యాలు పెట్టాలనే ఆచారం ఉండటంతో స్థానికంగా ఉన్న అర్చకులే ఏదో ఒక సమయంలో వచ్చి శాస్త్ర సంబంధమైన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇకపై అర్చకులను కూడా ప్రోత్సహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం పెంచిన సాయం నేరుగా అర్చకుల బ్యాంకు ఖాతాలకే జమ కాబోతోంది. వాటితోనే ధూప, దీప, నైవేద్యాలను అందించనున్నారు. ఆదాయం లేని దేవాలయాలకు సాయం పెంపుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.



సాయానికి ఎంపికైన లంకెలకూరపాడు శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

జిల్లాలో లబ్ధి ఇలా..

జిల్లాలో 203 ఆలయాలకు ధూప, దీప, నైవేద్య సాయంగా ఒక్కో ఆలయానికి రూ.10 వేల ఈ నెల నుంచి అందబోతోంది. నియోజకవర్గాల వారీగా ఎంపిక చేసిన ఆలయాలు పరికిస్తే..

నియోజకవర్గం	సాయం అందే దేవాలయాలు
మాచర్ల	34
గురజాల	38
సత్తెనపల్లి	26
పెదకూరపాడు	30
నరసరావుపేట	22
వినుకొండ	33
చిలకలూరిపేట	20

గ్రామాలపై నిరంతర నిఘా పెట్టాలి

ముప్పాళ్ల, న్యూస్‌టుడే : శాంతిభద్రతల సమస్యలకు అవకాశమివ్వకుండా గ్రామాలపై నిరంతర నిఘా పెట్టాలని, గొడవలు చేసే వారు.. వాటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సత్తెనపల్లి గ్రామీణ సీఐ ఎంవీ సుబ్బారావు సూచించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. పెండింగ్ కేసుల వివరాల్ని తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదాల్ని నిలువరించేలా జాగ్రత్తలు తీసుకోవాలని, నేరస్థుల కదలికలపై నిఘా పెట్టాలని సీఐ ఆదేశించారు. ఎస్సై సోమేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ

దుర్గి, న్యూస్‌టుడే : మండలంలోని అన్ని పంచాయతీల ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు 9, 10 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో రిఫరెన్సు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మీనారాయణ గుప్తా తెలిపారు.

ప్రతి ఒక్కరికి అండగా ప్రజా ప్రభుత్వం

■ ప్రజాదర్బార్‌లో వినతులకు సత్వర పరిష్కారం ■ ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో సమర్థ పాలన అందిస్తున్న ప్రజా ప్రభుత్వం ప్రతిఒక్కరికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 24వ వార్డులో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజాదర్బార్)లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అస్తవ్యస్తంగా మారిన వ్యవస్థలు, పరిపాలనను గాడిన పెట్టేందుకు చంద్రబాబు ఎంతో కష్టపడుతున్నారని అన్నారు. ప్రజల సమస్యల్ని తెలుసుకుని వాటికి సత్వర పరిష్కారాలు చూపించేందుకే ప్రజాదర్బార్‌ను కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సామాజిక భద్రతా పింఛన్లు, పక్కా ఇళ్లు, నూతన రేషన్ కార్డుల మంజూరుకు అధికసంఖ్యలో దరఖాస్తులు దాఖలయ్యాయి. మున్సిపల్ కమిషనర్ షమ్మి, తెదేపా నాయకులు రామస్వామి, శ్రీనివాసరావు, మేరిగ్రేస్ పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

శ్రీమహాలక్ష్మి.. నమోస్తుతే..

న్యూస్‌టుడే, బృందం : శ్రీమహాలక్ష్మి.. నమోస్తుతే అంటూ దుర్గమ్మకు భక్తులు పూజలు నిర్వహించారు. దేవి శరన్నవ రాత్రి మహోత్సవంలో భాగంగా మంగళవారం జిల్లాలో వివిధ ఆలయాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరణ చేశారు. భక్తులు పూజలు నిర్వహించారు.



అమరావతి : అమరేశ్వరాలయంలో మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు



శ్రీమహాలక్ష్మిగా నీలంపాటి లక్ష్మి అమ్మవారు



కొమెరపూడిలో ధనలక్ష్మిగా..



మాచవరం : శివాలయంలో..



గురజాల : పాతపాటమ్మ ఆలయంలో సంతానలక్ష్మిగా



బెల్లంకొండలో మహాలక్ష్మి అమ్మవారు



రెంటచింతల : ధనలక్ష్మి అలంకరణలో కనకదుర్గామాత



క్రోసూరులో రూ.50 లక్షలతో అలంకరణ



75 త్యాళ్లూరులో ధనలక్ష్మిగా



దుర్గిలో రాజరాజేశ్వరీదేవిగా



కారంపూడిలో బతుకమ్మ వద్ద కోలాటం



విజయపురిసౌత్‌లో మహాలక్ష్మిగా అమ్మవారు



పిడుగురాళ్ల : కన్యకా పరమేశ్వరి అమ్మవారు



పిడుగురాళ్ల : కరెన్సీ నోట్లతో అలంకరణ

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలి

కంభంపాడు (పెదకూరపాడు), న్యూస్‌టుడే : వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రభుత్వం చేపట్టిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతుల సద్వినియోగం చేసుకోవాలని పెదకూరపాడు వ్యవసాయాధికారిణి ఇంజం శాంతి తెలిపారు. కంభంపాడు, పరస గ్రామాల పరిధిలో వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పంటల్లో ఆశించే చీడపీడల నివారణకు రైతులకు సలహాలు ఇచ్చారు.

ముప్పాళ్ల : పత్తిలో గులాబీ రంగు పురుగు ఉనికిని గుర్తించేందుకు ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక్కో బుట్టలో ఎనిమిది రెక్కల పురుగులు వరుసగా మూడ్రోజులు ఉన్నట్లు గమనిస్తే ప్రొఫెనోఫాస్ ఎకరాకు 400 ఎంఎల్ లేదా క్లోరిఫెరిఫాస్ 500 ఎంఎల్ పిచికారి చేయాలని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ రైతులకు సూచించారు. మండలంలోని బొల్లవరంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పత్తి, మిరపలో సస్యరక్షణ చర్యలు వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు ప్రసాద్, పావని, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతి : పత్తిపంటలో సరైన సస్యరక్షణ చేపడితే అధిక దిగబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి అహ్మద్ రైతులకు సూచించారు. మండల పరిధిలోని లింగాపురం, నరుకుళ్లపాడులో పొలంబడి కార్యక్రమంలో రైతులకు ఆయన సూచనలు చేశారు.

అచ్చంపేట : పత్తిలో రసం పీల్చే పురుగులు పేనుబంక, తామర పురుగు, తెల్లదోమ, పచ్చదోమలను గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టి నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం ఆయన అచ్చంపేట, నీలేశ్వరపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు.



కంభంపాడులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

స్తంభం కనపడటం లేదు



పెదకూరపాడు- పాటిబండ్ల మార్గంలోని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో బీసీ కాలనీ, జగనన్న కాలనీకి విద్యుత్తు సరఫరా చేసేందుకు ఏర్పాటు చేసిన స్తంభానికి చిల్లకంప, తీగ మొక్కలు అల్లుకున్నాయి. ఇక్కడ స్తంభం కనబడనంతగా ఇవి పెరిగాయి. అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది.

–న్యూస్‌టుడే, పెదకూరపాడు

ఇసుక ఉచితంగా అందరికీ అందేలా చూడాలి

అచ్చంపేట : ఇసుక ఉచితంగా అందరికీ అందేలా చూడాలని సీపీఎం మండల నేతలు మంగళవారం స్థానిక తహసీల్దార్ జి.శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఇసుక సరఫరా సక్రమంగా లేక భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోతోందన్నారు. సీపీఎం మండల శాఖ కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి రవి, రైతు సంఘ నేతలు షేక్ హసన్, అశోక్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఊరేగింపు

విజయపురిసౌత్, న్యూస్‌టుడే : మాచర్ల మండలం విజయపురిసౌత్ శ్రీసీతారామాలయం రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ పురస్కరించుకుని మంగళవారం స్వామివార్ల విగ్రహాలను, రాజగోపుర శిఖర కలశాన్ని అంగరంగ వైభవంగా గ్రామవీధుల్లో ఊరేగించారు. బుధవారం బ్రహ్మశ్రీ వేదమూర్తులు వట్టిపల్లి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ రాజగోపుర శిఖర కలశ ప్రతిష్ఠ నిర్వహిస్తారు. కార్యక్రమంలో మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మారెడ్డి హాజరవుతారు.

అతి వేగం.. తీసింది ప్రాణం

దాచేపల్లి, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తుండగా వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని యువకుడు దుర్మరణం చెందారు. మంగళవారం దాచేపల్లి పట్టణంలోని బంగ్లా సెంటరులో ఇది జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సారంగపల్లి అగ్రహారానికి చెందిన షేక్ లాల్ (25) దాచేపల్లి పట్టణానికి ద్విచక్ర వాహనం మీద వచ్చాడు. మాచర్ల రోడ్డు వైపు నుంచి ప్రధాన కూడలికి అతివేగంగా వస్తుండగా వాహనం అదుపు తప్పి బంగ్లా సెంటరులో డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై పాపారావు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ మహిళ..

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే : తల్లిదండ్రులు మందలించారని ఓ మహిళ ఒంటిపై పెట్రోలు పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసి.. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని బ్రహ్మానందరెడ్డి కాలనీకి చెందిన అంగడి లీలావతి (38)కి, ఆమె భర్త సాంబయ్యకు మనస్పర్థలు రాగా తల్లిదండ్రులు వద్ద ఉండేది. పక్క ఇంటి వారితో తల్లిదండ్రులు గొడవ పడుతుండటంతో మహిళ వారించింది. ఈవిషయంపై ఆమెకు, వారికి వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన గత నెల 25న లీలావతి పెట్రోలు శరీరంపై పోసుకొని నిప్పు అంటించుకుంది. మంటలు వ్యాపించగా స్థానికులు వచ్చి మంటలు ఆర్పి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి తల్లి కంపా మంగమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.మోహన్ కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కారంపూడి, న్యూస్‌టుడే : రెండు రోజుల క్రితం నకరికల్లు లాకుల వద్ద గుర్తించిన మృతదేహం మండలంలోని పేటసన్నెగండ్లకు చెందిన కర్ల రవి (35)గా గుర్తించారు. నకరికల్లు ఎస్సై సురేష్ వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం నకరికల్లు లాకుల వద్ద గుర్తుతెలియని మృతదేహాన్ని గుర్తించామని, విచారణ జరపగ కారంపూడి మండలం, పేటసన్నెగండ్లకు చెందిన ఆటో డ్రైవర్ రవిదిగా గుర్తించామన్నారు. మృతదేహం చేతికి తాడుకట్టి ఉండటంపై అనుమానంగా ఉందని, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడికి భార్య మార్లమ్మ ఉంది.

నేల తడారే.. పత్తి గూడ రాలే

పత్తికి చీడపీడల బెడద
రైతుల్లో ఆవేదన

న్యూస్‌టుడే, పెదకూరపాడు

వర్షాల లేమి, చీడపీడల బెడద రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ సారి వీటి ప్రభావం పెరగడంతో పంటల దిగుబడి తగ్గి పెట్టిన పెట్టుబడి వచ్చే అవకాశం లేదని అన్నదాతలు దిగులు చెందుతున్నారు. అధిక వర్షాలకు అచ్చంపేట, అమరావతి, పెదకూరపాడులోని 40కు పైగా గ్రామాల్లోని వాగు ప్రభావిత ప్రాంతాల్లో పంట తుడిచి పెట్టుకుపోగా నీటి వసతి, వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న పంట ఎదుగుదల లోపించింది. పూత పిందె రాలుతోంది. బాగా ఉన్న పత్తి కూడా చీడపీడల కారణంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఉండటంతో పురుగు మందులు చల్లి పంటలను కాపాడుకుంటున్నారు. గత ఏడాదితో పోలిస్తే దిగుబడులు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ప్రస్తుతం మొదటి విడత పత్తి తీత మొదలు పెట్టేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మరో వైపు గూడ రాలుతోందని దిగులు చెందుతున్నారు. వర్షం లోటు వీటిపై అధిక ప్రభావం చూపింది. ఏ పంట చూసినా ఆశించిన మేర దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అయితే అతివృష్టి.. లేకుంటే అనావృష్టిలా పత్తి రైతు పరిస్థితి మారింది.



ఎదుగుదల లోపించి బెట్టకొచ్చిన పత్తి పంట



పత్తి సాళ్లలో రాలుతున్న గూడ

పట్టభద్రుల సమస్యలు పరిష్కరిస్తా

మాచర్ల (కారంపూడి) : పట్టభద్రుల సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందటం వల్ల కృష్ణా, గుంటూరు జిల్లాలో నిరుద్యోగులు పెరిగారని, తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో పోరాడుతానని ఎమ్మెల్సీ అభ్యర్థి లగడపాటి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించిన ఆయన 10 అంశాలతో కూడిన ప్రణాళిక విడుదల చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ 36 ఏళ్లుగా తాను విద్యారంగంలో అధ్యాపక నిగా విధులు నిర్వహిస్తూ.. సేవా కార్యక్రమాలు చేసినట్లు చెప్పారు. బీసీ సంఘ జిల్లా నేత శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘ నేత ఆదినారాయణ పాల్గొన్నారు.

వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలి

రెంటచింతల, న్యూస్‌టుడే : రాష్ట్రంలో గ్రామ, వార్డు వాలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని సంఘ జిల్లా అధ్యక్షుడు రాజు కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో సరోజనిదేవికి వినతిపత్రం అందజేశారు.

మహిళా పోలీసు మెడలో గొలుసు చోరీ

గ్రంధశిరి (అచ్చంపేట), న్యూస్‌టుడే : మండలంలోని గ్రంధశిరి గ్రామానికి చెందిన మహిళా పోలీసు జ్యోతి మెడలోని బంగారు గొలుసును దొంగలు మంగళవారం రాత్రి చోరీ చేశారు. క్రోసూరు నుంచి గ్రంధశిరి వెళ్లే మార్గంలోని చప్టా వద్ద ఇది జరిగింది. జ్యోతి గుంటూరు జిల్లా తురకపాలెం గ్రామ సచివాలయంలో మహిళా పోలీసు. ఆమె విధుల నుంచి తన భర్త ఊరికి మామ పెద్దబాబుతో కలసి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. గ్రంధశిరి మార్గ మధ్యంలో చప్టా వద్ద వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న దొంగలు ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కెళ్లారు. క్రోసూరు సీఐ సురేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరిస్తున్నారు. ఆమె భర్త ఛత్తీస్‌ఘడ్ సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు.

అమరవీరులకు పీసపాడు మహిళ నివాళి

క్రోసూరు (అచ్చంపేట) న్యూస్‌టుడే : కార్గిల్ యుద్ధంలో అమరవీరుల స్మారకార్థం దిల్లీలో నిర్మించిన స్తూపాల వద్ద నివాళి కార్యక్రమంలో క్రోసూరు మండలం పీసపాడుకు చెందిన అమరవీర సైనికుడు నేలవల్లి నేతాజీ తల్లి వీరమ్మ మంగళవారం పాల్గొన్నారు. ఆమె కుమారుడు నేతాజీ కార్గిల్ యుద్ధంలో అమరుడయ్యారు. రాష్ట్రం నుంచి ఆమె కుటుంబం కార్యక్రమానికి ఆహ్వానం అందుకుంది. స్తూపాల వద్ద సైనిక లాంఛనాలతో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె అమరులకు నివాళి అర్పించారు. ఆమెకు సైనిక అధికారులు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో హవల్దార్ బసంత్ తివారి, గొర్ల వసంత చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళి అర్పిస్తున్న వీరమ్మ, సైనికులు

కాలానుగుణ వ్యాధులపై అప్రమత్తత తప్పనిసరి

రాజుపాలెం, న్యూస్‌టుడే : కాలాగుణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్ అన్నారు. మగళవారం రాజుపాలెం పిహెచ్‌సిలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాత శిశు సంరక్షణలో భాగంగా ప్రతి ఒక్క ఆరోగ్య కార్యకర్త ప్రముఖ పాత్ర పోషించాలని సూచించారు. గర్భిణులకు ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రానికి ఆశ కార్యకర్తలు తీసుకురావాలని సూచించారు. వర్షకాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం దోమల వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించి, నివృత్తికి సలహాలు అందజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి రవితేజా నాయక్, ఆశా నోడల్ ఆఫీసర్ ఉషారాణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్

ఆటో బోల్తా పడి 12 మందికి గాయాలు

బాపట్ల: కాకుమాను మండలం రేటూరు పరిధిలో ఆటో బోల్తా పడి పల్నాడు జిల్లా క్రోసూరు మండలం 88 తాళ్లూరు గ్రామానికి చెందిన 12 మంది గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. కాకుమాను మండలం కొండపాటూరులో పోలేరమ్మ తల్లి మొక్కులు తీర్చుకోవటానికి తాళ్లూరు గ్రామ వాసులు వచ్చారు. ఆలయంలో మొక్కులు తీర్చుకున్న అనంతరం సూర్యలంక బీచ్‌కు ఆటోలో బయలుదేరారు. రేటూరు దాటిన తర్వాత వేగ నియంత్రణ వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో లక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఆమెను మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. అన్నపూర్ణ, నాగమోహన్, తిరుపతి స్వామి, మణి వాసంతి, నాగేశ్వరరావు తదితరులు గాయపడగా చికిత్స నిమిత్తం బాపట్ల ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

అమరావతి : స్థానిక విజయవాడ రహదారిలో 2న అహమ్మద్ రజ ఇంటి వద్ద ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలు, గతంలో గోరంట్ల వద్ద దొంగిలించిన మరో ద్విచక్ర వాహనం చోరీ కేసుల్లో అమరావతికి చెందిన చౌటపల్లి కార్తీక్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు అమరావతి సీఐ శ్రీనివాస్ తెలిపారు. వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.